



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -317 శనివారం 21 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# 3,24,234 కోట్లు

## శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు
- మూలధన వ్యయం రూ.47,267 కోట్లు
- మండలిలో పద్దును ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్
- 'చేయూత'తో 2 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం
- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం
- గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు
- ఉభయసభలు సోమవారానికి వాయిదా




**హైదరాబాద్ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లుగా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపెట్టారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున జీవిత బీమా అందించేలా ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. చేయూత పథకం ద్వారా అర్హులైన 2 లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగతా 2లో...

# పిరికివాళ్లు

## : నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

- ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్
- ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం
- హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ
- ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక

**న్యూఢిల్లీ,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు. మిగతా 2లో...



# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

## గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

## ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన



# అంతర్జాతీయ ప్రమాణాలతో

## విపత్తుల శిక్షణా కేంద్రం


డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష



2లో.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

- వేయికోట్ల కుంభకోణం జరిగింది
- రిటైర్డ్ అధికారుల నియామకంతో లాలూచీ
- స్కాం వివరాలను అసెంబ్లీలో ఎండగతాం



# కనిపించిన నెలవంక..

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు -నేడు పవిత్ర రంజాన్ పండగ

**న్యూఢిల్లీ,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు.



# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

- : సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై
- నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత
- సూసైడ్ నోట్‌లో బెదిరింపుల
- వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం
- అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్
- చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య



2లో.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లాలో విషాదం
- గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన
- ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు
- నీటిలో కొట్టుకుపోయిన ఐదుగురు విద్యార్థులు...
- మరో ఇద్దరు ఒడ్డుకు చేరిన వైనం
- ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాల వెలికితీత
- మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు



2లో.

# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

## : సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

### కేసు నేపథ్యం ఏమిటంటే..

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

### సుప్రీంకోర్టు ఏమంది?

ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృధా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.
అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం

**డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష**

**హైదరాబాద్,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి కచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్ టైమ్ మానిటరింగ్, సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్‌లు, హైస్పీడ్ బోట్లు వంటివాటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ , అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి, స్పెషల్ పోలీస్ బెటాలియన్ అడిషనల్ డిజీ సంజయ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు

**వేయికోట్ల కుంభంకోణం జరిగింది**

**రిటైర్డ్ అధికారుల నియామకంతో లాలూచీ**

**స్కాం వివరాలను అసెంబ్లీలో ఎండగతాం**

**హైదరాబాద్,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లలో స్కాంలు కొనసాగుతున్నాయని బిఆర్ఎస్ ఎ మ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులను పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి స్కాంలు చేస్తున్నాడని అన్నారు. అందులో సీఈ, ఈఎన్‌సీ అందరూ రిటైర్డ్ వాళ్లే ఉన్నారని తెలిపారు. నాలుగైదు స్కూళ్లను ప్యాకేజీ చేసి అన్యాయాలకు తెర తీశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వీటి టెండర్లలో రూ.1000 కోట్ల స్కాం జరిగిందని అన్నారు. ఇందులో బీజేపీ వారికి ఒకటి, రెండు ప్యాకేజీలు దక్కాయని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాలన్నీ బయటపెడతామని స్పష్టం చేశారు. ఈ వందల కోట్ల టెండర్ల కుంభకోణంపై శాసనసభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని అన్నారు. నా దగ్గర ఈ స్కామ్ కు సంబంధించి ఇంకా పూర్తి ఆధారాలు, వివరాలు ఉన్నాయని.. వాటన్నింటినీ అసెంబ్లీ సమావేశాల్లో సభ సాక్షిగా బయటపెడతానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పూర్తి చేయగా, అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఇవ్వలేదని హరీశ్‌రావు తెలిపారు. కక్షపూరితంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్కూళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు, అలాగే కొందరు బీజేపీ ఎమ్మెల్యేలకు మాత్రం స్కూళ్లు కేటాయించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లు ఆర్గనైజ్డ్ రింగ్ గా అయ్యి పనులను పంచుకుంటున్నారని అన్నారు. 76 స్కూళ్లకు సంబంధించిన ప్రతి టెండర్ కి ఎక్సెస్ ధర కోట్ చేసి దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లలో కనిష్టంగా 4.59? నుంచి గరిష్టంగా 4.96? ఎక్సెస్‌తో, నిబంధనల ప్రకారం 5? దాటకుండా పక్కా ఎ÷-లాన్‌తో కొల్లగొట్టారని విమర్శించారు. ఒక్కో స్కూలుకు రూ. 250 కోట్లు కేటాయించగా, అందులో సివిల్ వర్క్స్ కోసమే సుమారు రూ. 150 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని చెప్పారు. 76 స్కూళ్లకు సంబంధించి ప్రభుత్వ అంచనా వ్యయం రూ. 10,199.54 కోట్లు కాగా, కాంట్రాక్టర్లు దాన్ని రూ. 10,693.55 కోట్ల ఎక్సెస్‌తో దక్కించుకున్నారని అన్నారు. అంటే కేవలం ఈ టెండర్ల ద్వారా సుమారు రూ. 494 కోట్లు ప్రజాధనాన్ని అదనంగా దోచిపెడుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరల్లో అత్యధికంగా 4.95 శాతం ఎక్సెస్ ధరకు టెండర్లు కేటాయించడం పలు అనుమానాలకు కలిగిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నియోజకవర్గంలో 4.95 ఎక్సెస్.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్ నగర్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గం హుస్నాబాద్ లో 4.95 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని.. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గం కొల్లాపూర్ లో 4.77 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారని చెప్పారు. మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం వరంగల్ ఈస్ట్ లో 4.99 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నియోజకవర్గం నల్గొండలో 4.87 ఎక్సెస్ కు టెండర్ ఇచ్చారన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గం మంథనిలో 4.89 కు ఎక్సెస్ టెండర్ ఇచ్చారని తెలిపారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు ఏకంగా 9 స్కూళ్ల టెండర్లను ఈ ప్రభుత్వం అదే సంస్థకు కట్టబెట్టిందని పేర్కొన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే ఎక్కువ ధరకు టెండర్లు ఖరారు కావడం ఈ కుంభకోణానికి నిదర్శనమని చెప్పారు. నాడు కేసీఆర్ పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఏనాడూ రాజకీయ పక్షపాతం చూపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మిషన్ కాకతీయ మొదటి దశ నుంచే, మిషన్ భగీరథ, బీసీ,మైనార్టీ గురుకులాలు ఇలా ఏ పథకమైనా 119 నియోజకవర్గాలకు సమానంగా ఇచ్చారని అన్నారు మెడికల్ కాలేజీలను అన్ని జిల్లాలకు ఇస్తూ, నేటి కాంగ్రెస్ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గానికి కూడా ఇచ్చామని తెలిపారు దళిత బంధు లాంటి గొప్ప పథకాన్ని ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర చింతకాని నుంచే పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఘనత కేసీఆది అని హరీశ్‌రావు కొనియాడారు.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

పోలవరం,**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.
పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు.సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# కనిపించిన నెలవంక..

**మొదటిపేజీ తరువాయి**
పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

# పిరికివాళ్లు

**మొదటిపేజీ తరువాయి**
"అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు. కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం

**హైదరాబాద్మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**



ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. చట్టసభల్లో చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోందని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అసెంబ్లీలో జవాబు ఇవ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తుందని మధుసూదనచారి మండిపడ్డారు. ప్రతిపక్షాలు అడిగిన ఏ ఒక్కదానికీ జవాబివ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. మేం లేవనెత్తిన అంశలపై పలాయనం చిత్తగించడం కనిపిస్తోందని అన్నారు. ఎగవేతలు, ఎదురుదాడి, అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు.

# 3,24,234 కోట్లు

**మొదటిపేజీ తరువాయి**
చదివే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా పోషకాలతో కూడిన రాగిజావ, పాలు అందిస్తామని చెప్పారు.
ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. ఇంటర్ చదివే వికలాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో వంటశాలలను ఆధునీకరించేందుకు రూ.100 కోట్లు కేటాయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1000 కోట్లు, వీరనారి చిట్యాల ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ.400 కోట్లు, మిగతా యూనివర్సిటీలకు కూడా బడ్జెట్‌లో కొంతమేర కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మండలిలో పౌరసంబంధాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రతిపాదించారు.
అనంతరం ఉభయ సభలు సోమవారం ఉదయం 10 గంటలకు వాయిదా పడ్డాయి. శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్‌పై ప్రసంగిస్తూడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నామనీ, ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిపోయిందనీ, ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వం పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే ఆర్థిక క్రమశిక్షణతో పాలనను గాడిన పెడుతున్న తీరును వివరించారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమనీ, సుస్థిరమైన అభివృద్ధి వైపునకు నడిపించేలా బడ్జెట్ రూపొందించామని తెలిపారు.

### తెలంగాణ వృద్ధిరేటు 10.7 శాతం

2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం రూ.17,82,198 కోట్లు అనీ, వృద్ధిరేటు 10.7 శాతంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.3,57,13,886 కోట్లుగా ఉండగా వృద్ధిరేటు 8 శాతంగానే ఉందని చెప్పారు. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ 5 శాతం వాటా కలిగి దేశానికి బలమైన అభివృద్ధి యంత్రంలా ఉందన్నారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.8 శాతం ఉండగా 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయిందనీ, అదే సందర్భంలో 2024-25లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 10.6 శాతం ఉండగా ఈ ఏడాది 10.7 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం రూ.4,18,931గా ఉందనీ, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే 1.9 రెట్లు ఎక్కువ అని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

### సీఎస్ఎస్ నిధులపై దృష్టి

గత ప్రభుత్వం 2014 నుంచి 2023వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) నిధులను రాబట్టడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం భట్టి విమర్శించారు. తమ ప్రభుత్వం 2014-15 నుంచి 2023-24 వరకు సీఎస్ఎస్ కింద బకాయిపడ్డ రూ.3 వేల కోట్లను విడుదల చేసిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.7,072 కోట్లను రాబట్టామని చెప్పారు. మరింత చిత్తశుద్ధితో అధిక



నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

### రుణ పునర్వ్యవస్థీకరణతో నగదు వెసులుబాటు

గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించామనీ, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20 ఏండ్ల నుంచి 39 ఏండ్లకు పొడిగించడంలో సక్సెస్ అయ్యామని భట్టి తెలిపారు. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుంచి 2031-32 దాకా చెల్లించాల్సిన రూ.34,058 కోట్ల భారం కాస్తా రూ.11,915 కోట్లకు తగ్గిందని తెలిపారు. దాని ద్వారా రాష్ట్రానికి రూ.22, 142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగిందని చెప్పారు. ఈ ఏడాది రూ.27,988 కోట్ల అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చుకున్నామని తెలిపారు.

### రూపాయి పంపితే కేంద్రం ఇచ్చేది 42 పైసలే

కేంద్రానికి తెలంగాణ నుంచి రూపాయి పంపితే తిరిగి 42 పైసలే మనకు దక్కుతున్నదని భట్టి వివరించారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, సొంత రాబడి పెంచుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రాష్ట్రాలకు ఈ పంపకం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని 16వ ఆర్థిక సంఘం ముందు ఎత్తిచూపామన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీని కూడా కొలమానంగా తీసుకునేలా ఒప్పించామనీ, తెలంగాణ వాటాను 2.102 శాతం నుంచి 2.174 శాతానికి పెంచుకోవడంలో కొంతమేర సక్సెస్ అయ్యామని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ రైజింగ్ విజన్ -2047గ్లోబల్ సమ్మిట్ ఆధారంగానే తెలంగాణ రైజింగ్ విజన్-2047ని విడుదల చేశామని డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారు. ఆ సమ్మిట్‌లో వందకుపైగా ఎంఓయూలు జరిగాయనీ, వాటి ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ లో 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' ను ఆవిష్కరించారనీ, 2030 నాటికి పరిశోధనాభివృద్ధి, ఆధునిక తయారీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలపాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆ రంగంలో ఇప్పటిదాకా రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 2.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. రానున్నకాలంలో సింగపూర్‌కు చెందిన ఏజీఐడీసీ, వియత్నాంకు చెందిన విన్ గ్రూప్, జేసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల నుంచి 1,03, 500 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్యూర్..ప్యూర్..రేర్

తెలంగాణను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించామని భట్టి తెలిపారు. క్యూర్‌లో సేవారంగానికి, ప్యూర్‌లో ఉత్పాదక రంగానికి, రేర్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి అన్నారు. 30 వేల ఎకరాల్లో భూగర్భవిద్యుత్, పర్యావరణ అనుకూల స్మార్ట్ గ్రిడ్లతో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామనీ, దాన్ని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా 3.76 లక్షల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశామని ప్రకటించారు. జనగణనను డిజిటల్ విధానంలో చేయ బోతున్నామని తెలిపారు.
ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రూ. 9,222 కోట్లు ఆదా చేసుకున్నారనీ, రూ.500కే గ్యాస్‌సిలిండ్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు రూ.752 కోట్లు, ఉచిత కరెంటు ద్వారా పేదలకు రూ. 3,954 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. మహిళా శక్తి మిషన్ ద్వారా మహిళలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలు ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఇప్పటికే 57, 938 కోట్ల రూపాయల రుణం ఇప్పించామని తెలిపారు. 1,329 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని చెప్పారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకం కింద ఎస్టీలకు 12,600 కోట్ల బడ్జెట్‌తో వంద శాతం సబ్సిడీ కింద సోలార్ పంపు సెట్లను అందిస్తామనీ, 6 లక్షల ఎకరాల పోడు భూములలో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామనీ, విధివిధానాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు.

## రాములోరి కల్యాణ పనులకు శ్రీకారం.





**బయ్యారం/మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ సీతరామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణర్థం నిర్వహించే రాములవారి కళ్యాణ లగ్నపత్రిక ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు రాసీ ఆలయ కమిటీ వారికీ,భక్తులకు వినిపించారు.తదుపరి కార్యక్రమంలో భాగంగా రాములోరి కళ్యాణానికి పసుపు కొట్టి తలంబ్రాలు సిద్ధం చేసిన మహిళా భక్తులు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్వామి వారి పెళ్లి పనులు సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు.పసుపు దంచి పెళ్లి తలంబ్రాలు కలిపే ఘట్టానికి శ్రీకారం చుట్టారు.ఈ ఆనందసమయంలో మహిళా భక్తులు రంగులు పూసుకొని వసంతోత్సవం ఘనంగా జరుపుకున్నారు.ఆలయ ప్రాంగణంలోని తలంబ్రాలు కలిపే వేడుకను భక్తుల సమక్షంలో ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు.దీంతో సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణం మొత్తం కళ్యాణ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మహిళా భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా రుద్రాక్షల అప్పాచారి ఎన్నిక



**సత్తుపల్లి/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**సత్తుపల్లి కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు విరాట్ నగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా రుద్రాక్షల అప్పాచారి, కార్యదర్శిగా కందుకూరి వెంకటాచారి, కోశాధికారిగా కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అప్పాచారి మాట్లాడుతూ, రోజురోజుకు కార్పెంటర్ వృత్తి క్షీణించే పరిస్థితికి చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక యంత్రాలు, రెడీమేడ్ సామగ్రి, సిమెంట్, అల్యూమినియం వినియోగం పెరగడం వల్ల సంప్రదాయ వృత్తిదారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే మారుతున్న కాలానికి అనుగుణంగా కార్పెంటర్లకు ప్రత్యేక శిక్షణలు, ప్రోత్సాహకాలు అందించి వారి జీవనోపాధిని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మోహన చారి, కృష్ణ ప్రసాద్, బొట్టు బ్రహ్మం, వీరభద్రచారి, రామకృష్ణ, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రీహన బేగం, కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా అభినందించారు.


## అంగన్వాడి సెంటర్లో దుస్తులు పంపిణీ



**స్టేషన్ ఘన్పూర్/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త)** మండలంలోని తాటికొండ గ్రామంలో గల అంగన్వాడి సెంటర్లలో ప్రజా పాలన కార్యక్ర మంలో భాగంగా ప్రీస్కూల్ చిల్డ్రన్ కు యూని ఫాం పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సూపర్వైజర్ మహమ్మద్ నసిమున్నిస, గ్రామ సర్పంచ్ మారపాక సుజన శ్రీనివాస్, కార్యదర్శి అను ముల నర్మదా హాజరై మాట్లాడారు. అంగన్వా డీ సేవలను ప్రతి ఒక్కరు సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థి ని విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు నీల మాధు శ్రీనివాస్, దుబ్బాక నవ్య నాగరాజు, నలిమెల కోమలత ఏలియా,అంగన్వాడీ టీచర్స్ పద్మ , ధనలక్ష్మి, అరుణదేవి, పిల్లల తల్లులు, తదిత రులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు- కల నెరవేర్పు!

**మిట్టపల్లిలో ఘనంగా గృహప్రవేశం-లబ్ధిదారులకు అభినందనలు**





**తల్లాడ,/ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**పేదల సొంతింటి కలలను నిజం చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో కుటుంబానికి ఆనందాన్ని అందించింది. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది.సర్పంచి పోట్రు స్వప్న చేతుల మీదుగా గృహప్రవేశం నిర్వహించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల పేదలకు స్థిర నివాసం కలుగుతోందని తెలిపారు. ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఇందిరమ్మ లబ్ధిదారులు భూక్య కృష్ణ, రాణీలకు శు భాకాంక్షలు తెలియజేస్తూ వారి కొత్త ఇంటిలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోట్రు శరత్ బాబు, అంబటిపూడి శీను, ఉపసర్పంచ్ భూక్య నరేష్, వార్డు సభ్యుడు బానోతు నాగేశ్వరరావు, చల్లా తిరుపతిరావు, బూర్గు ఆల్ పంచ్, మాగంటి వెంకటేశ్వర్లు, బానోత్ బాలకృష్ణ, బానోతు రవి తదితరులు హాజరై లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు.

## ముస్లిం సహోదరులకు రంజాన్ శుభాకాంక్షలు.

**-కల్పన సునీల్ నాయక్**




**బయ్యారం/మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకురాలు కల్పన సునీల్ నాయక్ ముస్లిం సహోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నియమ నిష్టలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు.అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో కాలం వెళ్లదీయాలని,సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రత్యేక ప్రార్థనలు,ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిం సోదరులు,అదే స్ఫూర్తితో శనివారం ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కల్పన సునీల్ నాయక్ కోరారు.౦

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ.



**బయ్యారం/మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**
నేడు రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు,చెడును త్యజించడం,సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ పండగ సామరస్యానికి,సహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు,దాతృత్వానికి ప్రతీక అని ఆమె అన్నారు.అల్లాహ్ దీవెనలతో నియోజకవర్గ ప్రజలకు,ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని హరిప్రియ నాయక్ ఆకాంక్షించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని ఆమె పేర్కొన్నారు.మనిషిలోని చెడు భావనల్ని,అధర్మాన్ని,ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు.

## జగ్గుతండ పంచాయతీలో కోతుల బెడద తగ్గించేందుకు బోను ఏర్పాటు.



**బయ్యారం/మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీలో కోతుల సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం కోతుల నివారణ కోసం సర్పంచ్ జయంతి వెంకట కృష్ణ, ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,పాలకవర్గం ఆధ్వర్యంలో కోతుల బోను చేపించి దాని పనితీరును పర్యవేక్షించారు.ఈ సందర్బంగా సర్పంచ్,ఉప సర్పంచ్ మట్కాడుతూ కోతులను పట్టి వాటిని సురక్షితంగా అడవి ప్రాంతంలో తరలించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.అనంతరం జగ్గుతండ గ్రామ అభివృద్ధిలో భాగంగా 5వ వార్డులో ఇటీవల మంజూరు అయిన నూతన డ్రైనేజి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వట్టం సావిత్రి,కంద్రాతి యాకేష్,గుగులోత్ రూపేష్,ఈసం పావని,బానోత్ స్వాతి,మక్కల దుర్గారావు,ధర్మాసోత్ కవిత, జగ్గుతండా గ్రామ పెద్దలు,ప్రజలు,గ్రామ పంచాయతీ సెక్రటరీ ఉష,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలి.

**-డిఎంఎచ్ఓ కీ వినతి పత్రం అందజేసిన సర్పంచ్.**



**బయ్యారం/మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతి పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు సమస్యల గురించి శు క్రవారం జిల్లా వైద్య అధికారి రవి రాథోడ్ ని కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ కలిసి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా గంధంపల్లి ఆసుపత్రిలోని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగం గా ఉందని ప్లాంట్ ఉపయోగంలోకి తీసుకురావాలని,ఈ ప్రాంత ప్రజలతో పాటు ఒరిస్సా కార్మికులు కూడా అధికంగా ఉండటం వలన ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, అధికమొత్తంలో ఆసుపత్రికి మందులు పంపిణీ చేయాలన్నారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని పెంచాలని,మీటింగ్ హాల్ కూడా నిర్మించాలని డిఎంఎచ్ఓ దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ ప్రవీణ్ నాయక్ తెలిపారు.సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన డిఎంఎచ్ఓ త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

## పారిశుధ్య పనులను పర్యవేక్షించిన సర్పంచ్.



**బయ్యారం/,మార్చి 20.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం నారాయణపురం గ్రామ పంచాయతీలో శు క్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ సొలం బాలకృష్ణ పర్యవేక్షణలో పారిశుద్య పనులు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీలొ పారిశుధ్య నిర్వహణ,పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు బాలకృష్ణ తెలిపారు.నారాయణపురం గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజల,యువత సహకారంతో కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జవ్వాజి వంశీ,కుర్రి హరీష్,జవ్వాజి రవి,చెన్నబోయిన ఉపేందర్,బొబ్బల విజయ్,కురసం భద్రయ్య,జవ్వాజి గణేష్,పుల్లారావు గ్రామ యూత్ సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో స్తంభానికే ద్రోహమా?

**జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పోరాటానికి బీజేపీ అండ**







**ఖమ్మం,/ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వైఖరి పలు అనుమానాలకు తావిస్తున్నదని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా మండిపడింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బీజేపీ సంఘీభావం ప్రకటించింది.

దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆ హామీలు ఏమయ్యాయి?**

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే సొంత డబ్బులతో ఇళ్లు కట్టించి ఇస్తానన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పుడు ఆ మాటలను ఎందుకు మరిచారని ప్రశ్నించారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యను పట్టించుకోకుండా దాటవేత ధోరణి అవలంబించడం విచారకరమని విమర్శించారు.

**భూములపై పెద్దల కన్నా?**

ఎస్సార్ గార్డెన్స్ వెనుక జర్నలిస్టుల కోసం కేటాయించిన భూమిపై కొందరు ప్రభావశీలుల కన్ను పడిందని, కబ్జా ప్రయత్నాల కారణంగానే పంపిణీ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారని ఆరోపించారు.

**కలం యోధుల సొంతింటి కల ఎప్పుడు?**

సమాజానికి సేవ చేస్తున్న విలేకరులు సొంతింటి కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని బీజేపీ నేతలు పేర్కొన్నారు. అవినీతి, భూకబ్జాలతో కోట్లను కూడబెట్టే నాయకులు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని నిలదీశారు.

**హెచ్చరిక**

ప్రభుత్వం వెంటనే కల్లబొల్లి మాటలు మానుకుని ఇళ్ల స్థలాల కేటాయింపును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జర్నలిస్టుల పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మందడపు సుబ్బారావు, రవి రాథోడ్, మంద సరస్వతి, మారుతినేని వీరభద్ర ప్రసాద్, గడిలా నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వనమా వాసు



**ఖమ్మం/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా ముస్లిం సోదర సోదరీమణులకు తెలుగుదేశం పార్టీ నాయకుడు వనమా వాసు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, భక్తికి ప్రతీకగా నిలిచే ఈ రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో, అల్లాహ్ కృప కోసం ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులందరికీ ఈ పండుగ ఆనందాన్ని తీసుకురావాలని తెలిపారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సోదరభావంతో జీవించాలని, అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్

**-నరపోగు ప్రసాద్ బాబు**




**తల్లాడ/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు నరపోగు ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ మహానాడులో ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ, మహానాడు వేదికగా ఈ అంశాన్ని ప్రతిపాదించి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు. ఎన్టీఆర్ సేవలను గౌరవిస్తూ ఆయనకు భారతరత్న ఇవ్వాలని పార్టీ నాయకులు, అభిమాన సంఘాలు ఆకాంక్షిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల శాఖ పిలుపునిచ్చినట్లు తెలిపారు.

# నూతన ఫ్లెక్స్ ప్రింటింగ్ షాప్ ప్రారంభం



**తల్లాడ/మార్చి 20(జర్నలిస్ట్ వార్త);** తల్లాడ పట్టణంలోని లూర్దు మాత కాంప్లెక్స్‌లో శుక్రవారం నైరా ఆఫ్‌సెట్ & ఫ్లెక్స్ ప్రింటింగ్ షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తల్లాడ మండల నాయకులు పాల్గొని షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, పట్టణంలో ఆధునిక సదుపాయాలతో నూతన ఫ్లెక్స్ ప్రింటింగ్ యంత్రాన్ని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఇక్కడ పెళ్లి శుభలేఖలు, ఫ్లెక్సీలు, విజిటింగ్ కార్డులు తదితరాలను ఆకర్షణీయమైన డిజైన్లతో, నాణ్యతతో, సరసమైన ధరలకు అందిస్తామని తెలిపారు. తల్లాడ మండల ప్రజలు ఈ కొత్త వ్యాపారాన్ని ప్రోత్సహించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, భూక్య అంజయ్య, షేక్ రఫీ, రావూరి ఇజ్రాయిల్, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ జమాల్ తదితరులు పాల్గొన్నారు.


# కబ్జా కోరల్లో ఎల్లమ్మ ఓర్రే



## రెండెకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణ

## దారులు మూసివేత.. ప్రజల ఆవేదన

## అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు




**ఎల్కతుర్తి/ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని దామెర గ్రామంలో ఎల్లమ్మ ఓర్రే కబ్జా కోరల్లో చిక్కుకుని ప్రభుత్వ భూమి రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్ల తరబడి గ్రామస్తులు వినియోగిస్తున్న గొల్లవాడబోడగుట్ట జాలుబాట ఇప్పుడు పూర్తిగా ఆక్రమణలకు గురై ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.

గ్రామస్తుల వివరాల ప్రకారం, సర్వే నంబర్లు 415/బి, 866లో ఉన్న దాదాపు 2 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు సేద్యం పేరుతో ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. గతంలో సుమారు 30 మీటర్ల వెడల్పుతో ఉన్న బాట ప్రస్తుతం పూర్తిగా మూసుకుపోయి, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంకా, గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్ పరిసర భూములు కూడా క్రమంగా కబ్జాకు గురవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద సుమారు రూ.12.60 లక్షలతో నాటిన మొక్కలను తొలగించి భూమిని దున్నేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### 70 ఏళ్లుగా ఉన్న బాటకు తాళం!

బీజేపీ నాయకుడు ఠాగూర్ సామ్ సింగ్ మాట్లాడుతూ, తమ తండ్రుల కాలం నుంచి ఎల్లమ్మ ఓర్రే మార్గం ద్వారా జాలుబాట, బోడగుట్టలకు వెళ్లేవారని తెలిపారు. ప్రస్తుతం అదే మార్గాన్ని పూర్తిగా కబ్జా చేసి, ప్రజల రాకపోకలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### వైకుంఠధామానికి కూడా దారి లేకుండా..!

గొర్ల కాపరుల సంఘం గ్రామ అధ్యక్షుడు రొడ్డబోయిన లింగయ్య మాట్లాడుతూ, వైకుంఠధామం నుంచి శివాలయానికి వెళ్లే మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పిచ్చి మొక్కలు, కబ్జాలతో దారి పూర్తిగా మూసుకుపోయిందని తెలిపారు.

### అధికారులు ఎందుకు మౌనం?

ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని రక్షించి, పాత బాటను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇఫ్తార్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ స్వరూపా రవి

**ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన సర్పంచ్ స్వరూప రవి**





**స్టేషన్ ఘనపూర్/మార్చి 20(జర్నలిస్ట్ వార్త)** ;మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో శుక్రవారం రోజున ముస్లిం సోదరులకోసం గ్రామ సర్పంచ్ ముక్కెర స్వరూప రవి యాదవ్ ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉపవాస దీక్ష ముగియగానే ఉపవాస దీక్ష ఇస్తా విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మతసామరస్యానికి, హిందూ ముస్లింల ఐక్యత కోసం ఇలాంటి ఇఫ్తార్ విందులు ఎంతగానో ఉపయోగపడ తాయని అన్నారు. అన్నారు. హిందూ ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర స్వరూప రవి యాదవ్, ఉప సర్పంచ్ ఇసాక్, నాయకు లు ముక్కెర మధు యాద వ్, మారబోయిన దశరథం, మత పెద్ద షౌకత్ బేగ్, వార్డు సభ్యు డు అజ్జు బాయ్ ,ముస్లిం సోదరులు ఆజాం, రహీం, అజ్మత్ అలీ, హైద తలీ, రషీద్, ముస్తఫా, ఇతియాజ్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

# వంగరలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు మంచి స్పందన





**భీమదేవరపల్లి/మార్చి20 (జర్నలిస్ట్ వార్త):** ప్రజాపాలనప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అప్పయ్య (డిఎంహెచ్‌వో) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో ఎంజీఎం, సీకేఎం ఆసుపత్రుల నుంచి వచ్చిన నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలు అందించారు. జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్యుడు, ఎముకల నిపుణుడు, స్త్రీరోగ నిపుణురాలు ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 147 మంది ప్రజలు ఈ ఆరోగ్య సేవలను వినియోగించుకోగా, అందులో 28 మందిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వొల్లాల రమేష్, వార్డు సభ్యుడు శ్రీ రామోజీ మొండయ్య, గజ్జల రమేష్, డా. రహ్మాన్, డాక్టర్ రుబీనా, నర్సింగ్ అధికారులు, సూపర్వైజర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# దాడిలో గాయపడిన పద్దం వెంకటేష్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



**చంద్రుగొండ/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** అశ్వారావుపేట నియోజకవర్గం, చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో జరిగిన దాడిలో గాయపడిన పద్దం వెంకటేష్‌ను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

అనంతరం డీఎస్పీ ఎల్. ఆదినారాయణను కలిసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో శాంతి భద్రతలు సక్రమంగా ఉన్నాయని, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు అధికార మదంతో అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాన్ని అశాంతిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అడ్డొచ్చిన వారిపై విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారని అన్నారు. గత ఏడాది కూడా ఇదే వ్యక్తి బీఆర్ఎస్ నాయకులపై దాడికి పాల్పడ్డాడని, స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే మళ్లీ దాడికి దిగాడని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మరో రెండు సంవత్సరాల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, జరిగిన అన్యాయాలకు వడ్డీతో సహా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుంగారం సర్పంచ్ ప్రవీణ్ ప్రకాశ్, మాజీ సర్పంచులు పూసం వెంకటేశ్వర్లు, పండ్ల అంజన్‌రావు, భూపతి రమేష్, మేడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ, బెండాలపాడు ఉపసర్పంచ్ బానోత్ బాలు, గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల జానకిరాములు, సత్తి నాగేశ్వరరావు, బానోతు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

**సిబ్బందికి ప్రదర్శనతో శిక్షణ ఇచ్చిన అగ్నిమాపక సిబ్బంది**






**నర్సంపేట/ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** 99 రోజుల ప్రజా పరిపాలన కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని వెంకటేశ్వర బహుళ ప్రత్యేక వైద్యశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు వైద్యశాల సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపులంగా వివరించారు.

ప్రత్యేకంగా విద్యుత్ లోపం కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, రోగులు మరియు సిబ్బందిని ఎలా సురక్షితంగా బయటకు తరలించాలి అనే విషయాలను ప్రదర్శన ద్వారా చూపించారు. అగ్ని మంటలను ఆర్పేందుకు కార్బన్ డయాక్సైడ్ వాయువుతో పనిచేసే అగ్నిమాపక పరికరాన్ని ఎలా ఉపయోగించాలో కూడా సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు యు. సంపత్ (మాస్టర్ ఆఫ్ మెడిసిన్, మత్తు వైద్యం), వజ్జా సాగర్ (మాస్టర్ ఆఫ్ మెడిసిన్, సాధారణ వైద్యం)తో పాటు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా అగ్నిమాపక సిబ్బందిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ప్రధాన కానిస్టేబుల్ అయూబ్, రాజేందర్, అనిల్, సిరాజ్, వాహన చోదకుడు రమేష్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

## షార్ట్ సర్క్యూట్ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి -హాస్పిటల్ సిబ్బందికి ఫైర్ సిబ్బంది డెమో






**నర్సంపేట/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
99 రోజుల ప్రజా పరిపాలన కార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగే అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎలా అప్రమత్తంగా ఉండాలి, ప్రాణనష్టం లేకుండా ఎలా బయటపడాలి అనే అంశాలను హాస్పిటల్ సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు కార్బన్ డయాక్సైడ్ ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ను ఎలా ఉపయోగించాలో ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) ద్వారా చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యూ. సంపత్ (ఎండి, అనస్థీషియా), డాక్టర్ వజ్జా సాగర్ (ఎండి, జనరల్ ఫిజీషియన్) పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. హాస్పిటల్ సిబ్బంది కూడా ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ అయూబ్, రాజేందర్, అనిల్, సిరాజ్, డ్రైవర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల కాటు... నిలువునా మునిగిన రైతన్న!

## అధిక దిగుబడి ఆశలు బూడిద... 500 ఎకరాల్లో వరి పంట దెబ్బ




**సత్తుపల్లి/మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
అధిక దిగుబడి ఆశతో ఆర్.బి.ఆర్-15048 రకం వరి సాగు చేసిన సత్తుపల్లి మండల రైతులకు తీవ్ర నిరాశ ఎదురైంది. నకిలీ విత్తనాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిని రైతన్న నిలువునా మునిగిపోయాడు. సిద్ధారం, రేజర్ల సహా పలు గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట కోత దశకు చేరుకున్న సమయంలో కంకులు పూర్తిగా తాలూగా మారడంతో రైతులు షాక్‌కు గురయ్యారు. పెట్టిన పెట్టుబడి మొత్తం వృథా కావడంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోసపోయామని గుర్తించిన రైతులు తమకు విత్తనాలు విక్రయించిన దుకాణం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అయితే నిరసన జరుగుతుండగానే షాప్ యజమాని దుకాణం మూసి పరారైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో రైతుల ఆగ్రహం మరింత పెరిగింది. ప్రతి ఏడాది నకిలీ విత్తనాలతో మోసపోతూనే ఉన్నాం... మా బాధ ఎవరు వినాలి?" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలని, నకిలీ విత్తనాల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతు శ్రమను దోచుకునే నకిలీ విత్తనాల మాఫియాపై కట్టడి లేకపోతే ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# దళితులపై దాడులు ఆగాలి

## : మహాసభ విజయానికి పిలుపు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా రెండో మహాసభను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మహాసభ మార్చి 22, 2026న హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పోతురాజు సారయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నిర్మాణ బాధ్యులు కొట్టేపాక రవి తదితరులు హాజరుకానున్నారు. మహాసభ విజయవంతానికి సంబంధించి ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచినా దళితులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో దళితులపై దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయని, కుల వివక్ష ఇంకా తొలగలేదని మండిపడ్డారు. గ్రామ స్థాయి నుంచి మంత్రి స్థాయి వరకు ఉన్నత పదవుల్లో ఉన్నా వివక్షత తగ్గడం లేదని విమర్శించారు. దళితులను హింసించడం, కులం పేరుతో దూషించడం, అంటరానితనం కొనసాగించడం వంటి ఘటనలు ఇంకా చోటుచేసుకుంటున్నాయని




అన్నారు. దళితుల ఆస్తులను ఆక్రమిస్తున్న ఘటనలు పెరుగుతున్నప్పటికీ, అటువంటి కేసుల్లో సరైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో దళితులంతా ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో కనీసం 20 శాతం నిధులను దళితుల అభివృద్ధికి కేటాయించాలని, కేటాయించిన నిధులను పూర్తిగా వారి సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. దళితులకు కేటాయించిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం ఆపాలని కోరారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని, ఉప ప్రణాళిక నిధులను విడుదల చేయాలని, దళితుల రుణాల కోసం దరఖాస్తు చేసే అవకాశాలను కల్పించాలని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన "అంబేద్కర్ హస్తం" పథకం కింద రూ.12 లక్షల సహాయం ఇప్పటికీ అమలు కాలేదని, ప్రస్తుత బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి దళితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాజారపు రత్నం, మండల అధ్యక్షుడు రాజారపు దేవయ్య, పొడిగే కమలాకర్, పొన్నాల కనకయ్య, రాజారపు చంద్రయ్య, రాజారపు దిలీప్, రాజారపు బన్నీ, రాజారపు సుశీల్, రాజారపు పద్మ, రాజారపు పాల్, రాజారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రంజాన్ సెలవు


## నేటి పదో తరగతి పరీక్ష ఎప్రిల్ 2కు వాయిదా

**అమరావతి,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

------

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు

**తిరుపతి,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):**
చంద్రగిరి మండలం, ఎల్లంపల్లెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే



క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

-----

# డాలర్‌తో రూపాయి మారకం 93.15 కు చేరిక




**న్యూఢిల్లీ,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త)::** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్ ఆరంభంలో రికార్డు స్థాయిలో పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తొలిసారిగా 93.15 వద్దకు చేరింది. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడం రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇక బ్రెంట్ క్రూడ్ ధర ప్రస్తుతం బ్యారెల్ 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు సుదీర్ఘకాలంపాటు కొనసాగుతాయన్న భయాలు బ్రెంట్ క్రూడ్ ధరలు పైకి ఎగబాకేలా చేస్తున్నాయి. చమురు ధరలు పెరిగే కొద్దీ డాలర్‌కు డిమాండ్‌కు పెరిగి రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపించాయి. గురువారం గ్లోబల్ మార్కెట్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడటంతో సూచీలు కుప్పకూలాయి. డాలర్‌పై పెట్టుబడులు పెరగడంతో అమెరికన్ కరెన్సీ మరింత బలపడింది. ఫలితంగా రూపాయి సహా అనేక వర్ధమాన దేశాల కరెన్సీలపై ప్రతికూల ప్రభావం పడిందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థాగత మదుపర్లు కూడా భారత్ నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి మరింత పెరిగింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్యపరపతి విధానం కూడా ఈ పరిస్థితికి కొంత దోహదపడిందని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేటులో కోత పెట్టేందుకు సంకోచిస్తోంది. దీంతో, పెట్టుబడిదారులకు డాలర్ మరింత ఆకర్షణీయంగా మారి వర్ధమాన మార్కెట్స్ నుంచి నిధులు తరలి పోతున్నాయని నిపుణులు

# ధనమే కులం.. ఆస్తియే అస్థిత్వం.



కష్టపడినా వచ్చే ఆదాయం కనీస అవసరాలకే సరిపోతోంది. కొత్తగా ఏదైనా చేయాలంటే భారీ పెట్టుబడి అవసరం. వారసత్వ ఆస్తులు లేనివారికి బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి వెనకాడుతున్నాయి. ధనవంతుల బిడ్డలకు దొరికే విద్య, నెట్‌వర్కింగ్ సామాన్యుడికి కలగానే మిగిలిపోతున్నాయి. కేవలం రెక్కల కష్టాన్ని నమ్ముకుని సున్నా నుండి ఉన్నత స్థాయికి చేరడం అనేది ప్రస్తుత కాలంలో అసాధ్యం కాకపోయినా, అత్యంత కఠినమైన ప్రక్రియ. వారసత్వ సంపద లేని ప్రతిభావంతులు ఆర్థిక చట్రంలో నలిగిపోతున్నారు. సమాజం డబ్బును చూసి ఇచ్చే గౌరవాన్ని పక్కన పెట్టి, మనిషిని చూసి గౌరవించే రోజు రావాలి. అట్టడుగున ఉన్నవారు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు కేవలం సంక్షేమ పథకాలు కాకుండా, శాశ్వతమైన ఆర్థిక వనరులను కల్పించినప్పుడే ఈ రెండు కులాల మధ్య దూరం తగ్గుతుంది.

ధనమే కులం.. ఆస్తియే అస్థిత్వం.
నాడు కుల వ్యవస్థ సామాజిక అంతరాలకు వేదికైతే, నేడు ఆర్థిక వ్యవస్థ అంతకంటే లోతైన అగాధాన్ని సృష్టిస్తోంది. సమాజం ఎన్ని విప్లవాలు చూసినా, ఎన్ని సంస్కరణలు దాటుకువచ్చినా చివరకు మనిషిని కొలిచే కొలబద్ద డబ్బు దగ్గరే ఆగిపోతోంది. నేటి సమాజంలో రెండే కులాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఒకటి కలిగిన వర్గం, రెండు లేని వర్గం.

### ధనమే అగ్రవర్ణం.. పేదరికమే నిమ్నవర్ణం

ఒకప్పుడు కుల గౌరవం వంశపారంపర్యంగా వచ్చేది. కానీ నేడు, మనిషి ఏ కులంలో పుట్టాడన్నది పక్కన పెడితే, ఎంత సంపాదిస్తున్నాడన్నదే అతనికి దక్కే మర్యాదను నిర్ణయిస్తోంది. కోట్లు ఉన్నవాడు ఏ వర్గానికి చెందినవాడైనా సమాజం అతనికి ఎర్రవాసి కార్పెట్ వేస్తోంది. అదే సమయంలో, పూట గడవని నిరుపేద ఏ ఉన్నత కులంలో పుట్టినా అతనికి దక్కేది చిన్నచూపే. సంపద ఉన్నచోట సంస్కారం వెతుక్కుంటూ వస్తుందని, లేనిచోట వ్యక్తిత్వం కూడా వెలవెలబోతుందని నేటి సామాజిక పోకడలు స్పష్టం చేస్తున్నాయి.

### వారసత్వ సంపద ఎదగడానికి బలమైన అడుగు

ఆర్థికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కేవలం కష్టం ఉంటే సరిపోదు, దానికి అడుగు బలం కూడా అవసరమన్నది నగ్న సత్యం. తాతల కాలం నాటి ఆస్తులు, స్థిరాస్తులు ఉన్నవారికి అది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. వారు చేసే వ్యాపారాల్లో ఓటమి ఎదురైనా తట్టుకునే శక్తి ఉంటుంది. కానీ, తాతముత్తాతల నుండి చిల్లిగవ్వ కూడా వారసత్వంగా రాని సామాన్యుడి పరిస్థితి అగాధంలో ఉన్నట్లే.

### శ్రమకు దక్కని ప్రతిఫలం

సొంతకాళ్ల మీద నిలబడాలని తపించే యువతకు నేటి ఆర్థిక పరిస్థితులు సవాలు విసురుతున్నాయి. ఎంత



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.
సెల్ నంబర్ 9701249103